క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో వెంకన్న పవిత్రోత్సవాలు



వేంకటేశ్వరాలయ ఆవరణలో హోమం చేస్తున్న ఆలయ ప్రధాన అర్చకుడు శ్రీనివాసాచార్యులు

రోలుగుంట: స్థానిక కొండపై వెలసిన శ్రీ వెంకటేశ్వరాలయంలో మూడు రోజుల పాటు నిర్వహించే పవిత్రోత్సవాలు శుక్రవారం సాయంత్రం విశ్వక్సేన, అంకురార్పణతో ప్రారంభమయ్యాయి. శనివారం ఉదయం 9 గంటలకు పవిత్రములు సమర్పించారు. ఆలయ ఆవరణలో హోమం నిర్వహించారు. ముగింపు రోజు 14 ఆదివారం ఉదయం అష్టోత్తర కలశాలతో అభిషేకం చేయడం జరుగుతుందని అర్చకులు తెలిపారు.

గంజాయి అక్రమ రవాణాపై డ్రోన్ నిఘా



వడ్డిప మార్గంలో డ్రోన్ నిఘా ఏర్పాటు చేసిన కొత్తకోట సీఐ కోటేశ్వరరావు

రోలుగుంట : మండలంలో పూర్తి స్థాయిలో గంజాయి అక్రమ రవాణ అరికట్టేందుకు పోలీస్ శాఖ అవసరమైన అన్ని చర్యలు చేపట్టింది. కొత్తకోట సీఐ కోటేశ్వరరావు రోలుగుంట ఎస్ఐ పి.రామకృష్ణారావుతో కలసి మండలంలో అంట్లపాలెం, వడ్డిప, కొవ్వూరు తదితర గ్రామాల్లో శనివారం సాయంత్రం డ్రోన్ వదిలి ఆయా మార్గాలను పరిశీలించాచారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ రోలుగుంట పోలీస్ స్టేషన్ పరిధిలో ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా వారిపై నిరంతర డ్రోన్ నిఘా ఉంటుందన్నారు. చట్టప్రకారం కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

కృష్ణదేవిపేట ఎస్ఐ బదిలీ



ఎస్ఐ తారకేశ్వర్రావు



ఎస్ఐ భీమరాజు

గొలుగొండ/నాతవరం : కృష్ణదేవిపేట ఎస్ఐ తారకేశ్వర్రావు నాతవరం బదిలీ అయ్యారు. ఈమేరకు జిల్లా పోలీస్ అధికారుల నుంచి శనివారం ఉత్తర్వులు అందాయి. గత ఏడాది అక్టోబర్‌లో కృష్ణదేవిపేట ఎస్ఐగా తారకేశ్వరరావు బాధ్యతలు స్వీకరించారు. ఇప్పుడు నాతవరం బదిలీ అయ్యారు. కృష్ణదేవిపేట పోలీస్‌స్టేషన్‌కు కొత్త ఎస్ఐను జిల్లా పోలీస్ ఉన్నతాధికారులు నియమించాల్సి ఉంది. నాతవరం ఎస్ఐ భీమరాజును జిల్లా ఎస్పీ కార్యాలయం వీఆర్‌కి బదిలీ చేశారు. భీమరాజు ఏడాదికి పైగా ఇక్కడ పని చేశారు. కొత్త ఎస్ఐ తారకేశ్వరరావు ఆదివారం బాధ్యతలు చేపట్టనున్నారు.

పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో వైద్య శిబిరం



శిబిరాన్ని ఉద్దేశించి మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీనివాసరావు

నర్సీపట్నం : విశాఖ కిమ్స్ ఐకాన్ వారి సౌజన్యంతో పీఆర్‌టీయు ఆధ్వర్యంలో నర్సీపట్నం జిల్లా పరిషత్ హైస్కూల్(మెయిన్) శనివారం మెడికల్ క్యాంప్ నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న డీఎస్పీ పి.శ్రీనివాసరావు మాట్లాడుతూ నిర్వాహకులను అభినందించారు. కిమ్స్ ఐకాన్ మేనేజింగ్ డైరెక్టర్ సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో వైద్యులు సాయి బలరాం కృష్ణ, గోపాలరాజు, కె.వి.రమణ 300 మంది రోగులకు వైద్య సేవలు అందించారు. కార్యక్రమంలో పీఆర్‌టీయు జిల్లా అధ్యక్షుడు డి.గోపీనాథ్, టౌన్ సీఐ గోవిందరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మట్టి రోడ్డులో ఇక్కట్లు

కశింకోట: స్థానిక శాఖా గ్రంథాలయానికి వెళ్లే దారి అధ్వానంగా ఉంది. ఏ మాత్రం వర్షం పడినా బురదమయంగా మారుతోంది. దీంతో గ్రంథాలయానికి రాకపోకలు సాగించడానికి పాఠకులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. స్థానిక కోనేరు వద్ద ఉన్న గ్రంథాలయానికి జాతీయ రహదారి నుంచి చెరువు పక్కగా దారి ఉంది. ఇది మట్టి రోడ్డు కావడంతో వర్షం వచ్చిందంటే బురదగా మారడంతో పాఠకులను ఇక్కట్లకు గురి చేస్తోంది. దీని దృష్ట్యా సిమెంట్ రోడ్డుగా అభివృద్ధి చేసి ఇబ్బందులు తొలగించడానికి అధికారులు చర్యలు తీసుకోవాలని పాఠకులు, స్థానికులు కోరుతున్నారు.

సుఖమైన ప్రయాణానికి దారేది?



బురదమయంగా మారిన బాలోజు బంగ్లాకు పోవు రహదారి



కె.జె.పురం తాచేరు నది వద్ద శిథిలావస్థకు చేరి కుంగిన కల్వర్టు



వర్షంతో బురదమయంగా మారిన ఎం. కోడూరు వద్ద రహదారి



వంటర్లపాలెం వద్ద తాచేరు నది పక్కన శిథిలమైన రహదారి

- వర్షాలతో ఛిద్రమైన రహదారులు
- తాటిపర్తి రహదారిలో ప్రయాణం నరకం
- వంటర్లపాలెం వద్ద తాచేరు పక్కన రహదారికి గండ్లు
- కూలడానికి సిద్ధంగా కేజేపురం వద్ద కల్వర్టు
- అధ్వానంగా ఎరుకువాడ లక్ష్మీపురం రహదారి

మాడుగుల రూరల్ : ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పలు రహదారులు పూర్తిగా దెబ్బతిన్నాయి. ప్రధానంగా కె.జె.పురం తాచేరు నది సమీపంలో కల్వర్టు శిథిలావస్థకు చేరింది. భారీ వాహనాలను ఈ రహదారిలో నడపడం వల్ల కుంగిపోయి కూలడానికి సిద్ధంగా ఉంది. పాడేరు నుంచి విశాఖ, అనకాపల్లి, చోడవరం, వరకు నడిపే ఆర్టీసీ బస్సు సర్వీసులు కె.జె.పురం గ్రామం మీదుగా నడుపుతున్నారు. దీని వల్ల కల్వర్టు దెబ్బతింది. ఎప్పుడు పూర్తిగా కూలిపోతుందో చెప్పలేని స్థితిలో ఉంది. దీనికి తోడు అర్ధరాత్రి సమయంలో భారీ వాహనాలు కూడా కె.జె.పురం గ్రామం మీదుగా రావడంతో కల్వర్టు శిథిలమైందని స్థానికులు చెబుతున్నారు. ప్రమాద సూచికగా శిథిలమైన ప్రదేశంలో జెండాలు పాతారు. భారీ వాహనాలు నడపకుండా పోలీసులు గస్తీ ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

శిథిలమైన పాడేరు – వడ్డాది రహదారి..

వడ్డాది నుంచి పాడేరు పోవు రహదారి పూర్తిగా శిథిలావస్థకు చేరింది. ఈ రహదారి నిర్మాణానికి సుమారు రూ.30 కోట్లతో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మంజూరు చేశారు. అయితే సంబంధిత గుత్తేదారు నిర్లక్ష్యం వల్ల గతంలో పనులు చేపట్టలేదు. అదే గుత్తేదారు ఈ రహదారి నిర్మాణ పనులను సుమారు 8 మాసాల క్రితం ప్రారంభించారు. ఈ పనులు నేటికీ నత్తనడకగా సాగుతున్నాయి. ఈ వర్షాలకు వడ్డాది నుంచి ముకుందపురం, ఎం.కోటపాడు, సాగరం, సురవరం, ఎం.కోడూరు, కాశీపురం, వద్ద పెద్ద పెద్ద గోతులతో నిండి ఉండడం వల్ల బస్సులు, ప్రైవేటు వాహనాలు, ద్విచక్రవాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. 14 కిలోమీటర్లు పొడవునా గల ఈ రహదారి పనులు వెంటనే పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు. విజయరామరాజుపేట వద్ద బొడ్డేరు నది మీద కాజ్‌వే వర్షాలకు కొట్టుకుని పోయి ప్రజలు ఇబ్బందులు పడుతున్న స్థితిలో వడ్డాది నుంచి తాటిపర్తి వరకు రహదారి శిథిలావస్థకు చేరడంతో మరింత నరకయాతన పడుతున్నారు. సంబంధిత అధికారుల నిర్లిప్తత వల్ల ఈ రహదారి పనులు నత్తనడకన సాగుతున్నాయని ప్రజలు ఆవేదన చెందుతున్నారు. ఈ రహదారికి సంబంధించి బిల్లులు రాకపోవడం వల్ల పనులు నిల్చిపోయాయని ప్రచారం జరుగుతుంది. కె.జె.పురం తాచేరు నది పక్క నుంచి బాలోజు బంగ్లాకు పోవు రెండు కిలోమీటర్ల రహదారి పూర్తిగా బురదమయంగా మారింది. గ్రామానికి చెందిన 50 కల్లంపాకలు వారు ఈ రహదారి గుండా ప్రయాణాలు సాగిస్తున్నారు. అలాగే ఎం.కోటపాడు, ఘాట్‌రోడ్డుకు ఈ రహదారి మీదుగా నిత్యం ప్రయాణాలు సాగిస్తున్నారు. వర్షాలకు వంటర్లపాలెం వద్ద వరదగట్టుకు గండి పడడంతో పక్కన్న వున్న రహదారి కూడా దెబ్బతింది. దీంతో పాటు వీరవల్లి–లక్ష్మీపురం రహదారి కూడా శిథిలావస్థకు చేరింది. వర్షంతో బురదమయంగా మారింది. కె.జె.పురం జంక్షన్ వద్ద అప్రోచ్ రోడ్డు కూడా బురదమయంగా మారింది.



కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో పనులు నత్తనడకన

గత ప్రభుత్వం హయాంలో నిధులు మంజూరు కాగా, ఆ నిధులతో పనులు చేపట్టలేదు. పాత కాంట్రాక్టర్ మరలా ప్రస్తుతం పనులు చేస్తున్నారు. అయితే నత్తనడకన పనులు జరగడం వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఒక జిల్లా నుంచి మరో జిల్లాను కలిపే ప్రధాన రహదారి దుస్థితి ఇలా ఉంది. ఈ వర్షాలకు పలు చోట్ల గండ్లు పడ్డాయి. యుద్ధప్రాతిపదికపైన ఈ గండ్లు పూడ్చాలి. గత ప్రభుత్వం రహదారుల నిర్మాణానికి పెద్దపీట వేసింది. ఈ రహదారి పనులు యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలి.

– కాళ్ల అప్పలనాయుడు, మాజీ పీఏసీఎస్ అధ్యక్షుడు, కె.జె.పురం



కల్వర్టుకు మరమ్మతులు చేపట్టాలి

కె.జె.పురం తాచేరు వద్ద మీద కల్వర్టు కూలిపోయే స్థితిలో ఉంది. ప్రధాన రహదారి మీద భారీ వాహనాలు నిషేధం అని బోర్డు పెట్టినా వాహనాలు నడుపుతున్నారు. కల్వర్టు కూలిపోతే గ్రామానికి బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోతాయి. వెంటనే కల్వర్టుకు మరమ్మతులు చేపట్టాలి.

– బి.జగ్గప్పారావు, కస్పాజగన్నాథపురం గ్రామం

8 రైతు సేవాకేంద్రాలకు యూరియా విడుదల

మాడుగుల రూరల్ : మండలంలో 8 రైతు సేవా కేంద్రాలకు యూరియా విడుదల అయిందని ఎంపీడీవో కె.అప్పారావు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. పొంగలిపాక రైతు సేవా కేంద్రానికి 11.025 మెట్రిక్ టన్నులు (245 బస్తాలు), ఒమ్మలి రైతు సేవా కేంద్రానికి 11.025 మెట్రిక్ టన్నులు, జి. అగ్రహారం 11.025 మెట్రిక్ టన్నులు, జె.డి.పేట 11.025 మెట్రిక్ టన్నులు, ఎం.కోడూరు 12,510 మెట్రిక్ టన్నులు (267 బస్తాలు), మాడుగుల–1 12,510 టన్నులు, ఎం. కోటపాడు 12,510 టన్నులు, సత్యవరం 12,510 టన్నుల యూరియా విడుదలైందని, ఈ నెల 15వ తేదీ నుంచి ఆయా వీఏఏల ద్వారా పంపిణీ చేస్తామని తెలిపారు.

కెనాల్ మార్గంలో నాచు, మొక్కల తొలగింపు

కె.కోటపాడు : మండలంలో మెట్ట ప్రాంత గ్రామాల గుండా గల రైవాడ కెనాల్ మార్గంలో నాచు, మొక్కల తొలగింపు కార్యక్రమాన్ని జీవీఎంసీకి చెందిన లాస్కర్‌లు చేపడుతున్నారు. ఈ పనులను శనివారం డి.అగ్రహారం-గవరపాలెం గ్రామాల మధ్య కెనాల్ మార్గంలో నిర్వహించారు. కెనాల్ మార్గం నీటి అడుగున నాచు, మొక్కలు పెద్ద ఎత్తున పేరుకుపోవడం వల్ల నీటి ప్రవాహ వేగం మందగిస్తుంది. దీంతో జలాశయం నుంచి విశాఖపట్నం ప్రతి రోజు ప్రవహించాల్సిన 50 క్యూసెక్కుల నీటి ప్రవాహంలో అంతరాయం కలుగుతుంది. ఈ కారణంగా అధికారులు నాచు, మొక్కలను తొలగింపు చేపట్టారు.

సీజనల్ వ్యాధుల పట్ల నిర్లక్ష్యం వద్దు



రోగులను పరీక్షిస్తున్న వైద్యాధికారి ప్రసన్నకుమార్

నాతవరం : సీజనల్‌గా వచ్చే వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నాతవరం పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రసన్నకుమార్ అన్నారు. మండలంలో జిల్లేడపూడి పంచాయతీ శివారు వెంకయ్యపాలెం గ్రామంలో శనివారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 89 మంది రోగులను పరీక్షించి మందులు అందజేశారు. మరికొంత మందికి రక్త పరీక్షలు చేశారు. వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

హాసిని కుటుంబ సభ్యులకు పరామర్శ



విద్యార్థి కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న విద్యార్థి, ప్రజా సంఘాల నేతలు

మాకవరపాలెం : వసతిగృహంలో చదువుతూ మృతి చెందిన రంగాల హాసిని(13) కుటుంబ సభ్యులను ప్రజా సంఘాల నేతలు పరామర్శించారు. మండలంలోని బూరుగుపాలెంలో నివాసం ఉంటున్న రంగాల నాగమణి పెద్ద కుమార్తె హాసిని నర్సీపట్నం మండలం వేములపూడి బీసీ వసతి గృహంలో చదువుతూ శుక్రవారం మరణించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో శనివారం బూగరుపాలెంలో హాసిని కుటుంబ సభ్యులను సీఐటీయు జిల్లా నేతలు అడిగర్ల రాజు, ఈరెల్లి చిరంజీవి. ఐద్వా నాయకురాలు సూర్యప్రభ, ఎస్ఎఫ్ఐ జిల్లా, డివిజన్ నేతలు విజయ్‌కుమార్, సత్యనారాయణ పరామర్శించారు. తల్లి నాగమణితో మాట్లాడి మృతికి సంబంధించిన వివరాలు తెలుసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ సకాలంలో వైద్యం అందకపోవడం వల్లే హాసిని మృతి చెందిందని ఆరోపించారు. ఈ విద్యార్థిని మృతితో వసతి గృహ విద్యార్థులు ఆందోళనలో ఉన్నారన్నారు. ఇకపై ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. హాసిని మృతిపై తల్లిదండ్రుల సమక్షంలో కలెక్టర్ బహిరంగ విచారణ చేయించి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

పిల్లలు ప్రయోజకులు అయ్యేలా తల్లిదండ్రులు శ్రద్ధ చూపాలి



దిబ్బిడిలో విద్యార్థి చదువుల గురించి తల్లిదండ్రులను ఆరా తీస్తున్న ఉపాధ్యాయుడు మూర్తి



నేతవానిపాలెంలో విద్యార్థి తల్లితో మాట్లాడుతున్న మూర్తి

బుచ్చెయ్యపేట : తల్లిదండ్రులు తమ పిల్లలు ప్రయోజకులు అయ్యే వారి ఉన్నత చదువులకు తగిన చేయూత నివ్వాలని దిబ్బిడి జిల్లా పరిషత్ హై స్కూల్ గణిత ఉపాధ్యాయుడు ఎ.వి.ఎస్ మూర్తి కోరారు. దిబ్బిడి, నేతవానిపాలెం, బుచ్చెయ్యపేట, పోలేపల్లి గ్రామాల్లో పలువురు విద్యార్థుల ఇళ్లకు వెళ్లి వారి చదువుల గురించి తల్లిదండ్రులతో మాట్లాడారు. హైస్కూల్‌కు చెందిన పలువురు విద్యార్థులు ఇటీవల కాలంలో పాఠశాలకు గైర్హాజరవుతున్నారు. ఎక్కువ రోజులు పాఠశాలకు రాని విద్యార్థులను గుర్తించిన గణిత ఉపాధ్యాయుడు మూర్తి శనివారం ఉదయం 7 గంటలకే ఆయ విద్యార్థుల ఇళ్లకు వెళ్లారు. పదో తరగతి పబ్లిక్ పరీక్షలు రాయాల్సిన మీ పిల్లలను ఎందుకు స్కూల్‌కు పంపించడం లేదని తల్లిదండ్రులను అడిగి తెలుసుకున్నారు. పలువురు తల్లిదండ్రులు పొలం పనులు ఎక్కువగా ఉన్నపుడు పాఠశాలకు పంపించడం లేదని తెలిపారు. దీంతో విద్యార్థులకు ప్రతి రోజూ బోధించే పాఠాలు వినకపోతే వారు చదువులో వెనకబడి పోతారని తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. తమ పిల్లలు ఉన్నత చదువులు చదివి ఉన్నత స్థానాలకు వెళ్లి ప్రయోజకులు అవ్వాలని తల్లిదండ్రులు కలలు కనాలన్నారు. విద్యార్థి మేలుకో కార్యక్రమంలో భాగంగా 30 మంది విద్యార్థుల ఇళ్లను సందర్శించి కౌన్సెలింగ్ ఇచ్చారు. అనారోగ్యంతో ఉన్నవారికి మిగిలిన విద్యార్థులకు ఉపాధ్యాయుడు మూర్తి తన సొంత నిధులతో డ్రైఫ్రూట్స్ ప్యాకెట్లు అందించారు.

పంటలు పచ్చగా...చెరువులు నిండుగా...



పోతనవలసలో పచ్చగా కనిపిస్తున్న వరిపంట



వి.సంతపాలెంలో అలుగుపై నుంచి ప్రవహిస్తున్న మిగులునీరు

కె.కోటపాడు : ఖరీఫ్ సాగు కాలంలో వర్షాలు పూర్తి స్థాయిలో కురుస్తున్నాయి. గ్రామాల్లో గల సాగునీటి చెరువుల్లో వర్షపునీరు పెద్ద ఎత్తున చేరుకోవడంతో చెరువులన్నీ నిండుకుండల్లా దర్శిమిస్తున్నాయి. చెరువులు నిండుకోవడంతో చెరువుల అలువుల నుండి మిగులు నీరు పల్లపు ప్రాంతాలకు ప్రవహిస్తుంది. వరి పంట సాగు కాలం సమయాల్లో వర్షాలు పడుతుండడం వల్ల పలు గ్రామాల్లో వరి పంట పచ్చదనంతో దర్శనమిస్తుంది. ఖరీఫ్ సాగు కాలంలో వర్షాలు పూర్తి స్థాయిలో నిండుకోవడంతో పంటకు అనువైన సమయాల్లో నీటిని కాలువల ద్వారా మళ్లించుకోవచ్చునని వి.సంతపాలెం రంగరాజు చెరువు, వారాడలో తుంగ చెరువు, ఎ.కోడూరులో నాగారాయుడి చెరువు ఆయకట్టు రైతులు ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు.

కల్యాణవేంకటేశ్వరునికి ప్రత్యేక అర్చనలు



ఆలయంలో హుండీ లెక్కిస్తున్న దృశ్యం

మాడుగుల రూరల్ : కె.జె.పురం జంక్షన్‌లోని కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక అర్చనలు, పూజలు నిర్వహించారు. స్వామి వారికి ఏడువారాలు ప్రదక్షిణ కోసం భక్తులు పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో స్వామి వారి హుండీల్లో నగదును లెక్కింపు చేశారు. ఆలయ కమిటీ వ్యవస్థాపక ధర్మకర్త చైర్మన్ రాపేట రామకొండలరావు, ఉపాధ్యక్షుడు కాళ్ల అప్పలనాయుడు, కమిటీ సభ్యులు పుట్టా వెంకటరామప్పారావు, శ్రీవారి సేవకులు, పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించారు. అలాగే మాడుగుల వెంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భాద్రపద మాసం రెండో శనివారం స్వామి వారికి ప్రత్యేకంగా అర్చనలు నిర్వహించారు.

వలంటీర్ వ్యవస్థ ప్రజా సేవలకు అవసరమే



టీడీపీ సీనియర్ నాయకుడు గండి సింహాద్రి

రోలుగుంట : వైఎస్సార్‌సీపీ అధినేత మాజీ ముఖ్యమంత్రి ప్రజలకు చేరువలో అన్ని రకాల సేవలందించే మంచి ఆలోచనతో వలంటీర్ వ్యవస్థ రూపకల్పన చేసి అమలు చేశారని, వలంటీర్ వ్యవస్థ ఉండాల్సిందేనని టీడీపీ సీనియర్ నాయకుడు గండి సింహాద్రి అన్నారు. పంచాయతీస్థాయి పాలనలోను, నాయకత్వం తీరులో మార్పు రావాల్సిన అవసరం ఉందన్నారు. శనివారం ఆయన జేపీ అగ్రహారం గ్రామస్తులకు సంబంధించి భూ సమస్యలతో పాటు పలు అంశాలపై విలేకరులతో మాట్లాడారు. రైతులు భూ సమస్యల పరిష్కారంపై అవగాహన పెంచుకోవాలన్నారు. రికార్డులు రెవిన్యూ అధికారుల ఆధీనంలో ఉంటాయని, ప్రజాప్రతినిధులే రికార్డులు మార్పించారని అనడం సరికాదన్నారు. ఆర్డీవో స్థాయిలోనూ, భూములు కొనుగోలు చేసిన వారితో గ్రామస్తులు చర్చించారని, ఇరువర్గాల వారికి తనకు తోచిన సలహా మాత్రమే ఇచ్చానని, రైతులకు అన్యాయం చేసే ఆలోచన తనకు లేదన్నారు. భూ సమస్య పరిష్కారంపై ఎమ్మెల్యే రాజు ఎన్నికల ముందు హామీ ఇచ్చారని, ఎమ్మెల్యే పూర్తి స్థాయి బాధ్యత తీసుకొని రైతులకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.

మెడికల్ కళాశాల ప్రైవేటుపరం కాకుండా ఆపండి



కళాశాల భవనాల వద్ద మాట్లాడుతున్న పార్టీ మండల అధ్యక్షుడు రమణ

మాకవరపాలెం: స్థాయికి మించిన విమర్శలు మానుకుని మెడికల్ కళాశాలను ప్రైవేటు పరం చేయకుండా ఆపాలని శెట్టిపాలెం సర్పంచ్ అల్లు రామునాయుడు, టీడీపీ నేతలకు వైఎస్సార్‌సీపీ మండల నాయకులు సూచించారు. మండలంలోని భీమబోయినపాలెం వద్ద గత ప్రభుత్వం మంజూరు చేసిన మెడికల్ కళాశాల భవనాలను శనివారం వైఎస్సార్‌సీపీ మండల నాయకులు సందర్శించారు. ఈ సందర్భంగా పార్టీ మండల అధ్యక్షుడు చిటకెల రమణ, ఉపాధ్యక్షుడు భీమిరెడ్డి గోవిందరావు, జిల్లా కార్యదర్శి రుత్తల సత్యనారాయణ, నియోజకవర్గ పంచాయతీరాజ్ విభాగం అధ్యక్షుడు బొడ్డు గోవింద, పార్టీ నేత పెట్ల భద్రాచలం విలేకరులతో మాట్లాడారు. రాజకీయాలు పక్కనపెట్టి పేదలకు వైద్యం అందేలా కృషి చేయాలన్నారు. ఈ ప్రాంత ప్రజలను దృష్టిలో ఉంచుకుని మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్‌గణేష్ కళాశాల మంజూరు చేయించారన్నారు. మెడికల్ కళాశాలను ప్రభుత్వమే నిర్వహించేలా స్పీకర్ అయ్యన్న ఒత్తిడి తీసుకురావాలని డిమాండ్ చేశారు. మూడు అంతస్తుల భవనాలు కళ్లకు కట్టినట్టు కనిపిస్తుంటే పునాదుల స్థాయిలోనే ఉందని టీడీపీ నేతలు ప్రజలను తప్పుదోవపట్టిస్తున్నారన్నారు. మంత్రి పార్థసారథి స్వయంగా గత ప్రభుత్వం 17 మెడికల్ కళాశాలలు మంజూరు చేసినట్టు మీడియా ముఖంగా తెలిపారన్నారు. వీటిలో ప్రాసెస్‌లో ఉన్న 10 కళాశాలలను పీపీపీ విధానంలో నిర్మించనున్నట్టు వెల్లడించారని, అందులో నర్సీపట్నం కళాశాల ఉన్న విషయం తెలుసుకోవాలన్నారు. మెడికల్ కళాశాల నిర్మాణంపై తప్పుడు ప్రచారాలు మానుకోవాలన్నారు. పేదలకు ఉచితంగా మెరుగైన వైద్యం అందకుండా, ప్రైవేటుకు లబ్ధి చేకూర్చడమే టీడీపీ లక్ష్యంగా పెట్టుకుందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సర్వేశ్వరరావు, వైస్ ఎంపీపీ రాజారావు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

వారాడలో భారీ అన్నసమారాధన



అన్నసమారాధన జరుపుతున్న వినాయక యూత్ కమిటీ సభ్యులు

కె.కోటపాడు : వారాడ గ్రామంలో శ్రీ వినాయక యూత్ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద శనివారం రాత్రి అన్న సమారాధన జరిపారు. యూత్ కమిటీ సభ్యులు అన్నసమారాధనలో పాల్గొని భక్తులకు వడ్డన చేశారు. వారాడతో పాటు పరిసర గ్రామాలైన చిరికివానిపాలెం, యడ్లవానిపాలెం, వి.సంతపాలెం, ఆర్.వై.అగ్రహారం గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి ప్రసాదం స్వీకరించారు. కార్యక్రమంలో యూత్ కమిటీ సభ్యులు గిడుతూరి అప్పారావు, దొగ్గ నాగరాజు, రాజు, మహేష్, నారాయణమూర్తి, లెక్కల జగ్గునాయుడు, దేముడునాయుడు, బండారు రామునాయుడు పాల్గొన్నారు.

ధ్యాన వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక అలంకరణ

కశింకోట: స్థానిక ధ్యాన వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారు శనివారం ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చి కనువిందు చేశారు. వజ్ర కవచాలంకృతులతోపాటు వివిధ రకాల పూలు, తులసీమాలలతో అందంగా అలంకరించారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. విష్ణు సహస్ర నామార్చన చేశారు. నక్షత్ర దీపం ఇచ్చారు. ఆలయ అర్చకుడు రేజేటి రామచరణాచార్యులు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

నిండుగా నదులు, గెడ్డలు



వర్షాలకు వీరవల్లి అగ్రహారం వద్ద శారదానదిలో చేరిన నీరు

మాడుగుల రూరల్ : బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు తాచేరు, శారదనది, పాలగెడ్డ, చింతగెడ్డల్లో నీరు చేరింది. శనివారం మధ్యాహ్నం నుంచి ఏకధాటిగా వర్షం కురుస్తుండడంతో జలాశయాల్లో నీటిమట్టం క్రమేపీ పెరుగుతుంది. ఖరీఫ్ వరినాట్లు పూర్తి కావడంతో ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు వరిపంటకు ఎంతో ఉపయోగపడుతుందని రైతులు పేర్కొన్నారు.